



ఐస్క్రీం పార్లర్‌లో బంగారబ్బొమ్మలాంటి అమ్మాయి నుంచుంది. స్ఫురద్రూపి కాక పోయినా అలా కనపడాలని వేషం వేసుకున్న వో అబ్బాయి ఆమెకి కొంచెం దూరంలో నిలబడ్డారు. వాళ్ళతోపాటు నేనూ. నా కెందుకో అమ్మాయిని చూడాలనే అపేక్ష కంటే ఆ అబ్బాయిని చూడాలనే తాప త్రయం ఎక్కువయింది.

ఐస్క్రీంపార్లర్‌లో అడుగెట్టానో లేదో కొర కొరా చూశాడు. నేను ఆ క్షణం విస్తు పోయిన మాట నిజం. ఈ శత్రుత్వం ఎక్కడిది? కనీసం ఇంతక్రితం మేమెప్పుడూ దార్లో ఎదురన్నా ఎదురవలేదే? మరి...?

వెంటనే అర్థమై పోయింది. కాంపిటీషన్నమాట...?

నేను పాంచి పిల్లాడులా ముఖం పెట్టు కుని ఆ ముఖాన్ని పత్రికతో దాచేసు కున్నాను. కాని, అబ్బాయిమీదే నా దృష్టి!

పద్ధెనిమిదేళ్ళ పైనే వుంటుంది వయస్సు. చదువుందో లేదోగాని చదువు కున్నట్టే కనిపిస్తున్నాడు. జుట్టు నెలల తరబడీ క్షవరం చేయించుకోనట్టుగా (అతని కది 'బీటిల్స్ కట్' అయివుం టుంది) వుంది. రాత్రీ పగలూ తెలు స్తుందో లేదోగాని చలవకళ్ళ జోడుంది. దానికి ముఖాన్ని కప్పేసేంతటి పెద్ద పెద్ద అద్దాలు! కోరమీసాలు తిప్పి లంగరులాంటి గడ్డాన్ని నున్నగా దువ్వుకున్నాడు. పై బొత్తాలు విడిచిన బొమ్మల చొక్కాలో నుంచి ఛాతీ కనిపిస్తోంది. చొక్కా చేతులు పిలయినంత పన్నగా మడిచాడు. దాన్ని దండల పైకెక్కించడానికి కుస్తీపట్టి వుంటాడు! ఒకచేతికి మురుగు (వెండా?). మెళ్ళో సన్నని గొలుసు (బంగారమా?) వాచీ మోచేతికీ మణికట్టుకీ మధ్య కట్టాడు. అంత టైట్‌గావున్న పాంటు లోకి అతనికాళ్ళు ఎలా కూరాడో ఆ దేవుడికే తెలియాలి. అదీ, తుంటివరకూ మాత్రమే వుంది. ఎప్పుడో చెప్పి చెయ్య కుండా దిగజారి పోయేంత క్రిందికివుంది. జెత్తెడు వెడల్పున వెయిస్ట్‌బెల్టు. బూట్లు ఆయుధాల్లా మొనలు తేలి మెరుస్తున్నాయి. ఇన్ని అసౌకర్యాలతోనూ అతను కులాసాగానే కనిపిస్తున్నాడు!

అప్పుడప్పుడు బడాయిగా వాచీ చూసు కుంటున్నాడు. కళ్ళజోడు దిద్దుకుంటు న్నాడు. జుత్తును చేత్తో రాసుకుంటు న్నాడు. వెయస్ట్‌బెల్టును ఇంకా క్రిందికి లాక్కుంటున్నాడు. పెదాల మధ్య అంటీ అంటనట్టు సిగరెట్టుంచి గుప్పుగుప్పు మనిపిస్తున్నాడు. ఏదో సెంటువాసనకూడా ఘుముమ్మంటున్నది.

ఈ వేషం చూడగానే అతనెవరో పసి గట్టేశాను. రోమియో! ఆహా...ఎంత ఆకర్షణ!

అదేపనిగా బంగారబ్బొమ్మని చూస్తు న్నాడు. కళ్ళతో తాగేస్తున్నట్టుగా చూస్తు న్నాడు. నేనూ అమ్మాయిల్ని చూస్తాను. (అసలుచూడనివారెవరంట?) కాని, అంత బాహాటంగా కాదు. చూసీ చూడనట్టు. మరి ఇతనలాకాదు. ఎంత ధైర్యం? ఎంత చొరవ?

ఆ అమ్మాయిని చూశాను; మహా ఇబ్బంది పడిపోతుందనుకున్నాను. హాచ్చెర్యం, ...లేదు...!

అయినా, ఎందుకో ఆ అమ్మాయి మీద అనవసరంగా జాలిపడి పోయాను. రోమియోగారి చూపు నావైపు తిప్పుకో వాలనుకున్నాను. పలకరించాలనే వూహాలో తేలిపోయాను.

'నమస్కారమండీ రోమియోగారూ... నాపేరు ఫలానా. నేను ఫలానా...' అన్నాను.

చెయ్యి కలుపుతాడనుకున్నాను. మూతి వంకరగాపెట్టి రెండుసార్లు పైకీ కిందికీ తలాడించాడు. 'హాయ్...' అన్నాడు. నా పలకరింపులో అంత హాయి వుందేమో!

'మీ పేరు తెలుసుకోవచ్చునా?'

పేరే అడగాలా?

'మీ రెక్కడుంటారు?'

ఇల్లయితే చాలా చాలా దూరంలో వుంది.

దానిపని మనకి భోజనానికి నిద్రకి మాత్రమే.

'మిమ్మల్ని ఎక్కడెక్కడ కలుసుకోవచ్చు ?'

ఇప్పుడిక్కడవుంటే, కాస్సేపటికి మరో బస్టాప్‌లో వుంటాను. ఇంకాస్సేపటికి సినిమా హాలుదగ్గర వుండొచ్చు. షాపింగ్ సెంటర్లు, రైల్వేస్టేషన్లు చూసుకుని దేవాలయాల్ని అదీ సందర్శిస్తూ వుంటాను. ముఖ్యంగా రద్దీగా వుండే ప్రదేశాలు నా స్థావరం.

ఇన్ని పుణ్యకార్యాలూ పురుషకార్యాలూ నెరవేర్చ గల్గుతున్న అతన్ని, అభినందించి తీరాలి !

'చదువు కుంటున్నారా'

నాకు చదువేమిటి ? ఆడపిల్లల్ని అల్లరి పెట్టించడానికి తగిన చదువుంది. అయితే, మాలో చదువుకునే వాళ్ళూ లేక పోలేదు.

'మీ పని...!'

కనిపించడంలా ?

'మరి ఎలా గడుస్తుంది ?'

తెచ్చిపెట్టే తలిదండ్రులున్నారు. లేకపోతే అన్నదమ్ములున్నారు. బంధుజనమున్నారు. మాకేమోయ్...ఫ్రీ బర్డ్స్.

'మీ భవిష్యత్తుమాట...?'

దానిగురించి ఆలోచించే తీరిక నాకెక్కడుంది ? ఏ వయసులో ఎలా ఆనందించాలో నీకు తెలియదు. అందుకే నువ్విలా తయారయ్యావు.

'నా మాట అలా వుంచు. నువ్విప్పుడా అమ్మాయిని తినేస్తున్నావ్...పెళ్లి చేసుకుంటావా...?'

పెళ్ళా...? హహహహ్హా ... అలాంటి పదాలు నా డిక్షనరీలోనే వుండవు. కావాలంటే వెతుక్కో.

'పోనీ ప్రేమిస్తున్నావా...?'

ప్రేమా...! అదేమిటి? ఏ బజార్లో దొరుకుతుంది? కిలో ఎంత ?

'మరెందుకీ శ్రమ ?'

నువ్వుత్తి ఫూల్‌వోయ్.

ఇది శ్రమా? థ్రిల్ మై డియర్ బోయ్... థ్రిల్! నీకేంతెలుసు వట్టి బీసీ రకం! అమ్మాయిల్ని ఏడిపించడంలో అందం తెలియని దద్దమ్మవు. అందులో ఆనందం ఎరగని దేభ్యానివి.

'నీతో పోల్చుకుంటే...నువ్వన్న మాటలు రైటే. అది సరే ... ఏ అమ్మాయయినా తిరగబడితే...?'

బొత్తిగా నీకు ఆడాళ్ళంటే ఏం తెలియనట్టుగా వుంది. వాళ్ళకీ ఇది థ్రిల్లింగ్‌గానే వుంటుంది. కావాలంటే అడిగి తెలుసుకో. నాకు టైం లేదు.

ఇందులో సత్యమెంతో నాకూ తెలుసుకోవాలనే అనిపించింది. బంగారబ్బొమ్మను చూశాను.

'ఏమ్మా...రోమియోగారు ఇలా అంటున్నారు. నిజమా ?'

అమాయకులు గారూ..., మా అమ్మా నాన్నా మమ్మల్ని చదువుల కోసం పంపుతున్నారు. లేదా; ఉద్యోగాల కోసం పంపుతున్నారు. అంతేగాని మేము ఆడపిల్లలమని అనుకోవడంలేదు. మమ్మల్ని నిర్విచారంగా వీధిలోకి పంపిస్తున్నారంటే మా తల్లిదండ్రులకి కొండంత ధైర్యం వుండబట్టే కదా ? ఎందుకో తెలుసా ? ఇదుగో మా బాడీగార్డులు ! రోమియోలకి మా వెంటపడడం సరదా అయితే — అది మాకు రక్షణ !

'బాగానే వుంది గాని ... మరి శ్రుతి మించితేనో ?'

మీకు పిచ్చా యేం...? అలాంటిదేమీ జరగదు. కావలిస్తే చూడండి.

రోమియోగార్ని చూసి నవ్వింది. రోమియో తెల్లముఖం వేశాడు. అతనిలో సంచలనం రేగినట్టు ప్రతి అవయవమూ ప్రస్ఫుటం చేస్తోంది. టెక్నికలర్ రంగులన్నీ ముఖంలో కనిపించాయి.

అదే సమయానికి ఆపద్బాంధవిలా రత్నాలరాసి ఒకామె వన్నెలు విరజిమ్ముతూ వచ్చి నిలబడింది. బంగారబ్బొమ్మని రోమియోగారు విడిచిపెట్టేశారు ! బస్సొచ్చేసింది. బంగారబ్బొమ్మా, ఆ వెనక నేమా బస్సెక్కేశాము !

రోమియోగారు అక్కడే నిలబడి వున్నారు. రత్నాల రాసిని తినేస్తున్నట్టు చూసేస్తున్నారు...! ●

